సాక్షి
వికారాబాద్
మంగళవారం । 25 । జూన్ । 2024



రక్తహీనతకు చెక్

పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతకు చెక్ పెట్టవచ్చని నవాబుపేట వైద్యాధికారి నరేష్ చంద్ర అన్నారు. 9లో▸



యాలాల: రేళ్లగడ్డ తండాలో ప్రమాదకరంగా ప్రాథమిక పాఠశాల భవనం

ఏళ్ల తరబడి

- ప్రభుత్వ పాఠశాలల్లో అరకొర వసతులు
- ప్రహరీలు, గేట్లు లేక అవస్థలు
- మరుగుదొడ్లు లేకపోవడంతో ఆరుబయటికి విద్యార్థులు
- స్కూల్ ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు
- విష పురుగులు సంచరించే అవకాశం
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

పాలకుల మాటలకు చేతలకు పొంతన కుదరడం లేదు.. ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు కోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. దెబ్బతిన్న భవనాలు.. ఉరుస్తున్న గదులు, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు.. ఇలా చెప్పుకుంటూ పోతే బోలెడు సమస్యలు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి కాలేదు. మరుగుదొడ్ల నిర్వహణ సరిగ్గా లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. శిథిల భవనాల్లో భయంభయంగా చదువులు సాగుతున్నాయి.

పూర్తి వివరాలు 8వ పేజీలో..



ధారూరు బాలికల పాఠశాలలో అసంపూర్తిగా ప్రహరీ పనులు



దౌల్తాబాద్: బాలంపేట ఉన్నత పాఠశాలలో అధ్వానంగా మూత్రశాలలు

నత్తే నయం..!

రోడ్ల నిర్మాణంలో తీవ్ర జాప్యం

- 2020 – 21లో జిల్లాకు 13 రహదారులు మంజూరు
- అంచనా వ్యయం రూ. 56.85 కోట్లు
- నిర్మించాల్సిన దూరం 93.9 కిలో మీటర్లు
- మూడేళ్లు గడిచినా పూర్తికాని పనులు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



నవాబుపేట మండలం చించల్‌పేట్ - అక్నాపూర్ గ్రామాల మధ్య ఆగిన రోడ్డు పనులు

వికారాబాద్: పై ఫొటోలో కనిపిస్తున్న రోడ్డు నవాబుపేట మండల పరిధిలోని చించల్‌పేట్, అతతాపూర్, అక్నాపూర్ గ్రామాల మీదుగా నారేగూడ వరకు వెళ్లే దారి.. రెండు దశాబ్దాల క్రితం పీఎంజీఎస్‌వై పథకం కింద చించల్‌పేట్ గేట్ నుంచి అక్నాపూర్ వరకు 8కిలో మీటర్ల మేర రోడ్డు వేశారు. కాలక్రమేణా ఇది పూర్తిగా పాడైపోయింది. ఆరేళ్లుగా గుంతలు పడి ప్రయాణానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మూడు సంవత్సరాల క్రితం రూ.12 కోట్లతో చించల్‌పేట్ గేట్ నుంచి అక్నాపూర్ వరకు 8 కిలో మీటర్లు, అక్నాపూర్ నుంచి నారేగూడ వరకు 4 కిలోమీటర్ల మేర కొత్త రోడ్డు మంజూరైంది. పనులు ప్రారంభించినా నేటికీ 50 శాతం కూడా పూర్తి కాలేదు.

వాహనదారులకు తప్పని ఇబ్బందులు

కనెక్టివిటీ రోడ్లు ప్రాంతాల అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తాయి. ప్రభుత్వం ఆ దిశగా చొరవ చూపడం లేదు. చాలా ప్రాంతాలకు కనెక్టవిటీ రోడ్లు అవసరం ఉన్నా మంజూరు కావడం లేదు. రోడ్లు పూర్తిగా దెబ్బతినడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రవాణా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రజలు కొంత దూరమైనా వేరే మార్గాల్లో గమ్యం చేరుకుంటున్నారు. రోడ్లతో పాటు ఆయా మార్గాల్లో వంతెనలు, బ్రిడ్జీల నిర్మాణ పనులు సైతం ఏళ్లు కావస్తున్నా పూర్తి కావడం లేదు. హడావుడిగా రోడ్ల పనులు ప్రారంభిస్తున్నా ఆ తర్వాత నిధుల విడుదల కాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. కొన్ని చోట్ల పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. మరి కొన్ని చోట్ల కాంట్రాక్టర్లు లోపాయికారీగా వ్యవహరిస్తున్నారు. వేరే కాంట్రాక్టర్లు పనులు చేపట్టకుండా అధికారులు, ప్రజా ప్రతినిధులను మేనేజ్ చేస్తున్నారు. వారు ప్రారంభించిన పనులు పూర్తయ్యేదాకా టెండర్లు పిలవకుండా, పిలిచినా వేరే వారు టెండర్ వేయకుండా చూసుకుంటున్నారు.

అన్నీ అసంపూర్తిగానే..

2020 – 21 ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు పీఎంజీఎస్‌వై కింద 13 రోడ్లు మంజూరయ్యాయి. 93.9 కిలోమీటర్లు బీటీ రోడ్లు నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ.56.85 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని అంచనా వేశారు. కొన్ని పనులు ప్రారంభించి రెండున్నరేళ్లు కావస్తున్నా పూర్తి కాలేదు. పలుచోట్ల పనులను మధ్యలో ఆపేశారు. దీంతో నిర్మాణ వ్యయం పెరిగిపోతోంది. నిధుల కొరత కారణంగా అక్కడక్కడ పనులు నిలిచిపోయిన మాట వాస్తవమేనని.. సాధ్యమైనంత త్వరగా పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్ ఈఈ ఉమేశ్ తెలిపారు.

మెరుగైన వైద్యం అందించాలి

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- పట్లూర్ పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీలు

మర్పల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదేశించారు. మర్పల్లి మండలం పట్లూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేదని అసహనం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించాలని సిబ్బందికి సూచించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాములు యాదవ్, మండల వర్కింగ్ ప్రసిడెంట్ సురేష్, పట్లూర్ ఎంపీటీసీ స్వప్న, పంచలింగాల మాజీ సర్పంచ్ సురేష్, సహకార సంఘం వైస్‌చైర్మన్ ఫసి, మండల నాయకులు రాచన్న, మహేశ్, రాఖేశ్ తదితరులు ఉన్నారు.

అంచనాలు తయారు చేయండి

ధారూరు: లక్నాపూర్ ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల మరమ్మతులకు అంచనాలు తయారు చేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ నీటిపారుదల శాఖ చేవెళ్ల సర్కిల్ ఎస్‌ఈ రంగారెడ్డిని ఆదేశించారు. జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు మాణిక్‌రెడ్డి, మోమిన్‌కలాన్, నాగారం మరికొన్ని గ్రామాల ఆయకట్టు రైతులు సోమవారం నగరంలో స్పీకర్‌ను కలిసి ప్రాజెక్టు కాలువల విషయాన్ని తెలియజేశారు. స్పందించిన ఆయన ఎస్‌ఈ రంగారెడ్డిని పిలిపించి కాలువలకు మరమ్మతులు చేయాలని ఆదేశించారు.



ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

న్యూస్‌రీల్

జడ్జిని కలిసిన కలెక్టర్



అనంతగిరి: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ ప్రతీక్‌జైన్ సోమవారం కోర్టు సముదాయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు మొక్కను బహూకరించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఉన్నారు.

శివకుమార్‌కు బంగారు పతకం



బంగారు పతకం అందుకుంటున్న శివకుమార్

దౌల్తాబాద్: ప్రపంచస్థాయి అండర్ –19 వంద మీటర్ల పరుగు పందెంలో మండలంలోని యాంకి గ్రామానికి చెందిన సున్నపు శివకుమార్ బంగారు పతకం సాధించారు. నేపాల్‌లో ఈ నెల 20నుంచి 24వ తేదీ వరకు పోటీలు జరిగాయి. శివకుమార్ విజేతగా నిలిచి బంగారు పతకం అందుకున్నారు. అతన్ని గ్రామస్తులు, స్నేహితులు అభినందించారు.

ఫైళ్లు పెండింగ్‌లో పెట్టొద్దు

ఎస్పీ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: పోలీస్ శాఖలో విధి నిర్వహణకు సంబంధించిన ఫైళ్లను ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్‌లో ఉంచరాదని ఎస్పీ నారాయణరెడ్డి డీపీఓ సిబ్బందికి సూచించారు. సోమవారం తన కార్యాలయంలో డీపీఓ సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సమన్వయంతో పనిచేయాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం, డీపీఓ సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలపై విచారణ జరిపించండి

ఇబ్రహీంపట్నం రూరల్: జిల్లాలో జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని సేవ్‌రంగారెడ్డి జిల్లా ఉద్యమ సంస్థ కోర్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా కమిటీ నాయకులు మాట్లాడుతూ.. జిల్లాకు అక్రమంగా వచ్చిన వారిని ఆయా జిల్లాలకు తిరిగి పంపించాలని కోరారు. ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు స్పందించి విచారణ జరిపిస్తామని చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పొనగంటి మహిపాల్‌రెడ్డి, బి.మధుకర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, సునీత, మాధురి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

సత్వరం పరిష్కరించాలి

కలెక్టర్ ప్రతీక్ జైన్

- ప్రజావాణికి 250 అర్జీలు

అనంతగిరి: ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజావాణి దరఖాస్తులను స్వీకరించారు. 250 మంది వివిధ సమస్యల పరిష్కారం కోసం అర్జీలు ఇచ్చారు. భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపి పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తోడ్పాటునందించాలి

మహిళల ఆర్థిక ఎదుగుదలకు తోడ్పాటునందించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా శక్తి కార్యాచరణ ప్రణాళికపై జిల్లా గ్రామీణాభివృద్ధి సిబ్బంది ఏపీఎం, సీసీలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024 –25 సంవత్సరం కింద చేపట్టాల్సిన 14 రకాల పథకాలపై మహిళల్లో అవగాహన కల్పించాలన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా 9,722 యూనిట్లకు 11,354 లక్షల రూపాయల రుణాలకు గ్రౌండింగ్ చేయాలన్నారు. పెరటి కోళ్ల పెంపకం, మండల స్థాయిలో క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, సామూహిక పప్పు ధాన్యాల సేకరణ, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర యూనిట్ల ఏర్పాటుకు ముందుకు వచ్చే మహిళలను ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌డీఓ శ్రీనివాస్, లీడ్ బ్యాంక్ మేనేజర్ యాదగిరి, అడిషనల్ డీఆర్‌డీఓ సరోజ, డీపీఎంలు రామమూర్తి, శ్రీనివాస్, వీరయ్య, నర్సింలు పాల్గొన్నారు.

నిర్దేశించిన రుసుమే తీసుకోవాలి

మీ సేవ కేంద్రం నిర్వాహకులు ప్రభుత్వం నిర్దేశించిన రుసుం మాత్రమే తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.మార్పల్లి మండలంలో మీసేవ కేంద్రం నిర్వాహకులు ప్రజల నుంచి అధికంగా డబ్బు వసూలు చేస్తున్నారని ప్రజావాణిలో ఫిర్యాదు రావడంతో కలెక్టర్ ఇలా స్పందించారు. సంబంధిత మీసేవ కేంద్రం నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు.

టెండర్ల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని దుకాణాలకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఆర్టీసీ రీజినల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కుర్మయ్య తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. మహబూబ్‌నగర్ రోడ్డువైపు ప్రస్తుతం ఉన్న ఆర్టీసీ దుకాణ సముదాయంపై మొదటి అంతస్తులో 11 షాపులను నూతనంగా నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ షాపులకు టెండర్లను పిలుస్తున్నట్లు చెప్పారు. అడ్వాన్స్ టెండర్లలో భాగంగా ఒక్కో దుకాణానికి రూ.2లక్షల డిపాజిట్ నిర్ణయించామని, ఆన్‌లైన్‌లో బిడ్స్ నిర్వహించడం జరుగుతుందన్నారు. టెండర్ వేసేందుకు ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు గడువు ఉంటుందని తెలిపారు. హార్డ్ కాపీలను ఈ నెల 27న ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మహబూబ్‌నగర్‌లో రీజినల్ టెండర్ బాక్సులో వేయాలన్నారు. టెక్నికల్ బిడ్‌ను ఈ నెల 27న మధ్యాహ్నం 3గంటలకు తీయడం జరుగుతుందని, కమర్షియల్ బిడ్ ఈ నెల 28న ఉదయం 11గంటలకు ఓపెన్ చేయనున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకు 91009 98229, 99592 26285, 94406 77428 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నిరాశ పరిచిన నైరుతి

- వర్షాల కోసం రైతన్న ఎదురుచూపులు
- రుతుపవనాల రాకతో ముందుగానే సాగు పనులు
- సాగుపై తీవ్ర ప్రభావం



దుద్యాల్: మండలంలోని ఆలేడు గ్రామంలో మొక్కలు ఎండిపోకుండా స్ప్రింక్లర్ల సాయంతో నీరందిస్తున్న దృశ్యం

తాండూరు: వరుణుడు ముఖం చాటేశాడు. నైరుతి రుతుపవనాలు సమయానికి రాష్ట్రానికి చేరుకున్నాయి. రుతుపవనాల ఆగమనంతో ఈ నెల రెండో వారంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురిశాయి. పది రోజులుగా జిల్లాలో వర్షాల జాడ లేదు. వాతావరణ శాఖ నుంచి వర్షాలు కురుస్తాయనే ప్రకటన వస్తుందని ఎదురు చూసిన రైతులకు నిరాశే ఎదురవుతోంది. మరోవైపు ఎండల తాకిడి అధికం కావడంతో ఉక్కపోతతో పాటు పంటలపై తీవ్ర ప్రభావం పడుతోంది. ప్రతి రోజూ ఆకాశం మబ్బులు కమ్ముకుంటున్నాయి. కానీ దివి నుంచి గంగ మాత్రం భూమికి దిగడం లేదు. వర్షాలు కురుస్తాయనే ఆశతో రైతులు ఇప్పటికే విత్తనాలు నాటారు. మొలకలు కూడా వచ్చాయి. వర్షాభావ పరిస్థితుల కారణంగా మొక్కలకు తేమ లేకపోవడంతో ఎండుముఖం పడుతున్నాయి.

70శాతం విత్తు పూర్తి

ప్రస్తుత సీజన్‌లో జిల్లాలోని 20 మండలాల్లో 5.97లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేస్తారు. 70 శాతం వరకు పత్తి, కంది, మొక్కజొన్న, వరి వంటి విత్తనాలు వేశారు. మిగిలిన రైతులు వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో పత్తి పంట విస్తీర్ణం తగ్గించారు. 2.53లక్షల ఎకరాల్లో సాగుకు సిద్ధమయ్యారు. కంది పంట 1.50లక్షల ఎకరాల్లో సాగు చేయవచ్చని అంచనా. ఈ నెలలో జిల్లా వ్యాప్తంగా 108 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. తేలిక పాటి భూముల్లో 50 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా ఈ భూముల్లో విత్తుకునే అవకాశం ఉంది. కానీ నల్లరేగడి నెలల్లో 75 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైన తర్వాతే విత్తనాలను విత్తుకోవాలి.

ఆరు మండలాల్లో వర్షాభావం

జిల్లాలోని 6 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. నైరుతి రుతుపవనాలు కారణంగా జూన్ నెల మొదటి రెండు వారాల్లో 108 ఎంఎంల వర్షపాతం నమోదైంది. వ్యవసాయ శాఖ అధికారులు లెక్కల ప్రకారం సాధారణ వర్షపాతం కంటే అధికంగానే వర్షాలు కురిశాయని రైతులు పెద్ద ఎత్తున పొలాల్లో విత్తనాలు వేసుకున్నారు. ఈ నెల మూడో వారం నుంచి ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడం లేదు. మరోవైపు జిల్లాలోని 6 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. వాటిలో నవాబుపేట్, వికారాబాద్, పుడూరు, పరిగి, కుల్కచర్ల, దుద్యాల్ మండలాలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో 30 ఎంఎంల నుంచి 60 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. మరో వారం రోజులు వర్షాభావ పరిస్థితులు సంభవిస్తే రైతులు వేసిన విత్తనాలు పూర్తిగా ఎండిపోయే అవకాశం లేకపోలేదు.

“ ఆశించిన స్థాయిలో వర్షాలు పడలేదు



రాష్ట్రాన్ని తాకిన నైరుతి రుతుపవనాల వల్ల భారీగా వర్షాలు కురుస్తాయని అనుకున్నాం. కానీ రుతుపవనాలు వేగంగా మందగించాయి. దీంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఇతర రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మన ప్రాంతంలో ఇందుకు భిన్నంగా. జిల్లాలో సాగు చేసిన పంటలకు మరో వారం రోజుల వరకు ఎలాంటి ఇబ్బంది లేదు. అప్పటిలోగా వర్షాలు పడకపోతే మొక్కలు వాడిపోతాయి. రైతులు పంటలు ఎండిపోకుండా నీటి తడులు పెట్టి కాపాడుకోవాలి.

– డాక్టర్. సుధాకర్‌చౌరట్, ప్రధాన శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన స్థానం, తాండూరు

వర్షాల కోసం పూజలు



ద్యాచారంలో పూజలు చేస్తున్న రైతులు

అనంతగిరి: వర్షాల కోసం రైతులు వరుణదేవుడికి పూజలు చేస్తున్నారు. పది రోజులుగా వానజాడ లేకపోవడంతో విత్త వేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో పది రోజులు వర్షాలు పడకపోతే పూర్తిగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం వికారాబాద్ మండలం ద్యాచారంలో, గొట్టిముక్కుల గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



గొట్టిముక్కులలో బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న రైతులు

క్లుప్తంగా

పూడ్చిన మృతదేహం వెలికితీత

వ్యక్తి మృతిపై అనుమానంతో పోస్టుమార్టం చేయించిన పోలీసులు



శవాన్ని బయటకు తీయిస్తున్న పోలీసులు

దౌల్తాబాద్: అంత్యక్రియలు పూర్తయిన వ్యక్తి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేయడం స్థానికంగా కలకలం రేపింది. మండలంలోని బిచ్చాల గ్రామానికి చెందిన కొరిడె అశోక్(35) ఈనెల 11న ఇంట్లో అనుమానాస్పదంగా మృతి చెందారు. అప్పట్లో భార్య రేణుక తనకు ఎలాంటి అనుమానం లేదని అంత్యక్రియలు సైతం నిర్వహించారు. రెండు రోజుల తర్వాత మృతుడి అన్న తన తమ్ముడి మృతిపై అనుమానం ఉందని, హత్య చేశారని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్‌ఐ రవిగౌడ్ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో సోమవారం తహసీల్దారు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కొడంగల్ వైద్యులు, పోలీసులు శవాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిర్వహించారు. తదుపరి విచారణ జరిపి హత్యా? ఆత్మహత్యా? అని నిర్ధారిస్తామని ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం సమయంలో భార్య లేకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపించారు.

విద్యుత్ తీగలు తెగిపడి లారీ దగ్ధం

అధికారులదే బాధ్యత అంటున్న లారీ ఓనర్



మంటల్లో కాలిపోతున్న లారీ

తాండూరు టౌన్: విద్యుత్ తీగలు తెగి లారీ మీద పడటంతో దగ్ధమైన ఘటన తాండూరు పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన ఎండీ జావిద్ తన లారీని ఆదివారం రాత్రి స్థానిక వైట్ ప్యాలెస్ సమీపంలో పార్కింగ్ చేశారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఒక్కసారిగా లారీకి మంటలు అంటుకుని దగ్ధమైంది. సమాచారం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. అయితే విద్యుత్ తీగలు తెగిపడటంతో లారీ దగ్ధమైందని, ఇందుకు విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని జావిద్ ఆరోపించారు. తనకు రూ.9 లక్షల మేరకు నష్టం జరిగిందని, ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. ఈ ఘటనపై విద్యుత్ ఏడీ ఆదినారాయణను వివరణ కోరగా.. విద్యుత్ తీగల కింద లారీ పార్కు చేసి ఉందన్నారు. అయితే తీగలు తెగడంతో లారీ దగ్ధమయ్యిందా లేదా ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే విషయాన్ని విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అంత్యక్రియలకు వెళ్లొస్తూ.. అనంత లోకాలకు

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం
- తాండూరు–కొడంగల్ మార్గంలో ఘటన



వినోద్‌కుమార్ (ఫైల్)

యాలాల: బంధువు అంత్యక్రియలకు వెళ్లొస్తుండగా ఓ వ్యక్తిని మృత్యువు బస్సు రూపంలో కబళించింది. బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టగా ఈ ఘోరం సంభవించింది. ఈ సంఘటన మండల పరిధిలోని తాండూరు–కొడంగల్ మార్గంలో ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు పట్టణం గ్రీన్ సిటీ కాలనీకి చెందిన జంగం వినోద్‌కుమార్(42) నాపరాతి వ్యాపారం చేస్తున్నారు. కాగా సోమవారం కోస్గిలో సమీప బంధువు మృతి చెందడంతో అంత్యక్రియలకు వెళ్లారు. అనంతరం సాయంత్రం తిరిగి బైక్‌పై వస్తుండగా, ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో తాండూరు నుంచి దౌల్తాబాద్ వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయమై వినోద్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య నాగజ్యోతితో పాటు ఒక కొడుకు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఏళ్ల తరబడి.. అదే ఒరవడి

సరస్వతీ నిలయాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేస్తామని పాలకులు, అధికారులు చెబుతున్నా.. ఆచరణలో పెట్టలేకపోతున్నారు. ఫలితంగా విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది సౌకర్యాల లేమితో సతమతమవుతున్నారు. వసతుల కల్పనకు సర్కారు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నా.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడేఅన్న చందంగా మారింది. ఇక ఉపాధ్యాయుల సంగతి సరేసరి. సమయపాలన పాటించకపోవడంతో పిల్లలూ వారినే అనుసరిస్తున్నారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన వారే ఇష్టంగా వ్యవహరిస్తుండగా.. పర్యవేక్షించాల్సిన విద్యాధికారులు మౌనం దాలుస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. సోమవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని సర్కారు బడులను 'సాక్షి' విజిట్ చేయగా.. అనేక విషయాలు వెలుగు చూశాయి..

వసతుల లేమితో విద్యార్థులు సతమతం

- పాఠశాలల్లో మరుగు దొడ్లు లేక.. ఆరు బయటకు పరుగు
- బడికి ఎప్పుడైనా పోవచ్చన్న ధోరణిలో ఉపాధ్యాయులు
- వారినే అనుసరిస్తున్న పిల్లలు
- నన్నగిల్లుతున్న విద్యాప్రమాణాలు.. పట్టించుకోని విద్యాధికారులు

తాండూరు రూరల్: తాండూరు మండలం చెంగోల్ జిల్లా ఉన్నత పాఠశాల ఆవరణలో పెద్ద రాళ్లగుట్ట ఉంది. ఈ గుట్టను తొలగిస్తే ప్రాంగణంలో విద్యార్థులు ఆడుకోవడానికి అవకాశం ఉంది. కానీ ఈ విషయంపై ప్రజాప్రతినిధులు, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. క్రీడల సంగతి అటుంచితే.. అసలు ఈ బడికి పీఈటీ లేడు. ఈ కారణంగానూ విద్యార్థులు ఆటలకు దూరం అవుతున్నారని వాపోతున్నారు. ఈ పాఠశాల్లో తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమం కొనసాగుతుండగా.. 300 మంది విద్యనభ్యసిస్తున్నారు. హెచ్‌ఎంతో కలిపి 14 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. ఇంత మంది పిల్లలు ఇక్కడ చదువుతుండగా.. సరిపడా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. ఇటీవల అమ్మ ఆదరణ కమిటీ ద్వారా రూ.70 వేలతో బాలికలకు టాయిలెట్లు నిర్మించారు. కానీ బాలురకు లేకపోవడంతో ఆరుబయటకు పరుగు తీస్తున్నారు. ఇప్పటి వరకు 100 మంది బాలురకు యూనిఫాం అందలేదు. ప్రహరికి మరమ్మతు చేయాల్సి ఉంది. మధ్యాహ్న భోజనం మెను పాటించడం లేదని, మెడికల్ కిట్లు, నాప్కిన్స్ రావడం లేదని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఇక ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో 56 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్‌ఎం తెలిపారు.



తాండూరు రూరల్: చెంగోల్ జడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో రాళ్లగుట్ట



అత్యవసరాలకు ఆరుబయటకు వెళ్తున్న స్టూడెంట్స్

శిథిలావస్థలో పాఠశాలలు

యాలాల: మండలంలో 10 ఉన్నత, 50 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ ఏడాది 30వేల పైగా పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు పాఠశాలలకు చేరాయి. ఆయా స్కూళ్లలో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో మరమ్మతు పనులు కొనసాగుతూనే ఉన్నాయి. సరిపడా ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గిరిజన తండాల్లో ఈ ఈ సమస్య ఎక్కువగా ఉంది. 1 నుంచి 5 తరగతులకు ఒకే ఉపాధ్యాయుడితో పాటు గదుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. చాలా బడుల్లో గదులు, భవనాలు బీటలువారి, వర్షాలకు పైకప్పులు తడుస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్న భోజన విషయంలో నాణ్యతా ప్రమాణాలు అంతంతా మాత్రంగానే ఉంటున్నాయి. మెడికల్ కిట్లు లేవు. బడుల్లో చేపట్టిన మరమ్మతు పనుల్లో నాణ్యతతో పాటు ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో.. పనులు నెమ్మదించాయి.

మరుగుదొడ్లున్నా.. శుభ్రం సున్నా..



పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు

ఆమనగల్లు: ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలల్లో అభివృద్ధి పనులను చేపట్టినప్పటికీ.. ఇంకా చాలా బడుల్లో పూర్తికాలేదు. మండలంలో 29 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. మండలంలో 5 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10 తరగతులు కొనసాగుతుండగా.. 390 మంది విద్యనభ్యసిస్తున్నారు. 22 మంది ఉపాధ్యాయులు ఉండగా.. ఇటీవల నలుగురు టీచర్లు బదిలీ అయ్యారు. పాఠశాలలో విద్యార్థులు ఇతర అవసరాలకు బోరు నీటిని వాడుతున్నప్పటికీ.. తాగడానికి నీరు లేక ఇబ్బంది పడుతున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉన్నా.. వాటిని శుభ్రం చేయడానికి స్కావెంజర్ లేరు. అప్పుడప్పుడు మున్సిపాలిటీ సిబ్బంది శుభ్రం చేస్తున్నారు. కొన్నేళ్లుగా అటెండర్, వాచ్‌మెన్, స్వీపర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వాచ్‌మెన్ లేక పోవడంతో.. ఆకతాయిలు పాఠశాల ఆవరణ, మరుగుదొడ్ల మాటున ఉంటూ.. విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని, వెంటనే వాచ్‌మెన్‌ను నియమించడంతో పాటు.. పాఠశాల వెనుకభాగంలో ప్రహరి ఎత్తును పెంచాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

తరగతి గదిలోనే వంట



బుద్దారం బడి తరగతిలో వంట సామగ్రి

పెద్దేముల్: సర్కారు బడుల్లో వసతులు కొరవడి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో సెలవుల దినాల్లో పాఠశాలల్లో అభివృద్ధి పనులు ప్రారంభించారు. కానీ.. విద్యా సంవత్సరం ప్రారంభమైనా.. క్షేత్రస్థాయి బడుల్లో పనులు పూర్తి కాలేదు. మండల పరిధి కర్ణాటక సరిహద్దు గిరిజన పాఠశాలలు అధ్వానంగా ఉన్నాయి. 1నుంచి 5 తరగతులను ఒక్క ఉపాధ్యాయుడే బోధిస్తున్నారు. ఆ టీచర్ అత్యవసర సమయంలో సెలవు పెడితే విద్యార్థులకు తీవ్ర నష్టం తప్పదు. గాజీపూర్ పాఠశాలకు ప్రహరి, బుద్దారం, ఊరేంటితండా బడులకు వంట గదులు లేక, క్లాస్ రూముల్లో వంట చేస్తున్నారు. బాయిమీదితండా, జైరాం తండా, ఉఫానాయక్‌తండాల ఐదు తరగతులకు ఒక్కరే టీచర్. బడులు తెరిచి పది రోజులు గడుస్తున్నా.. నేటికీ 40శాతం వరకు ఏకరూప దుస్తులు సరఫరా అయినట్లు ప్రధానోపాధ్యాయుల ద్వారా తెలుస్తోంది.

సమయపాలన పాటించని టీచర్లు



బండివాడ సీపీఎస్ పాఠశాలలో విద్యార్థులు లేక ఒంటరిగా కూర్చున్న ఉపాధ్యాయుడు

దౌల్తాబాద్: విద్యా వ్యవస్థ దయనీయంగా మారింది. పాఠశాలల్లో వసతుల లేమితో పాటు ఉపాధ్యాయుల పనితీరు సక్రమంగా లేదంటూ విమర్శలు వస్తున్నాయి. మండల పరిధి బండివాడ పాఠశాలలో ఉదయం 9గంటలకు ప్రార్థన చేయాల్సి ఉండగా.. ఇక్కడి ఉపాధ్యాయులు తీరిగ్గా 9.40నిమిషాలకు బడికి వస్తారు. వీరి ఆలస్యం కారణంగా ఉన్న నలుగురు విద్యార్థులకు ఒక్కరూ రాలేదు. తిమ్మారెడ్డిపల్లిలో ఐదుగురు టీచర్లు ఉండగా.. ఒకరు డిప్యుటేషన్ వెళ్లారు. మరొకరు సెలవు పెట్టారు. ఏడు తరగతులకు గాను ముగ్గురే పాఠాలు బోధిస్తున్నారు. పాఠశాల, సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన విద్యాధికారులు.. పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. బాలంపేట ఉన్నత పాఠశాలలో బాలికలకు మూత్రశాలలు అధ్వానంగా ఉన్నాయి. వంటగదులు లేకపోవడంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఆరుబయటే వండుతున్నారు.

వాచ్‌మెన్‌ను నియమించాలి



బాలికల ఉన్నత పాఠశాలలో వెంటనే వాచ్‌మెన్‌ను నియమించాలి. పాఠశాల వెనుకభాగంలో ప్రహరీ ఎత్తు తక్కువగా ఉండటంతో గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాలలో చొరబడుతున్నారు. మూత్రశాలలో దాక్కుని భయపెడుతున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేశాం. చర్యలు తీసుకోండి. విద్యార్థినులకు రక్షణ కల్పించండి.

– సంధ్య, 10వ తరగతి, బాలికల ఉన్నత పాఠశాల, ఆమనగల్లు

మెడికల్ కిట్ల పంపిణీ లేదు

పహాడీషరీఫ్: జల్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో 280 మంది విద్యార్థులకు ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఉన్నారు. సాంఘిక శాస్త్రం, పీఈటీ పోస్ట్ ఖాళీగా ఉంది. వాచ్‌మెన్ లేకపోవడంతో రాత్రి పూట తక్కువ ఎత్తులో ఉన్న ప్రహరీ నుంచి ఆకతాయిలు పాఠశాలలోకి చొరబడుతూ.. విలువైన వస్తువులను అపరిస్తున్నారు. ఆయా, స్వీపర్ లేకపోవడంతో పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. వాటర్ ట్యాంకు నల్లాలు మరమ్మతుకు నోచుకోవడంతో నీరు వృథాగా పోతోంది. విద్యార్థులకు మెడికల్ కిట్ల పంపిణీ లేదు.

ఏకోపాధ్యాయుడు



పదో తరగతి విద్యార్థులతో ఉపాధ్యాయుడు

బొంరాస్‌పేట: మండల పరిధి రేగడిమైలారం జడ్పీ పాఠశాల ఒకే ఉపాధ్యాయుడితో కొనసాగుతోంది. ఆరు నుంచి పది వరకు తరగతులు నడుస్తున్నాయి. 2017–18 విద్యాసంవత్సరం నుంచి పదో తరగతి ప్రారంభించారు. 2023–24 విద్యా సంవత్సరానికి పదో తరగతి విద్యార్థులు 28 మంది పరీక్ష రాయగా.. 9మంది పాసయ్యారు. ప్రస్తుతం సంవత్సరానికి 22మంది (బాలికలు10, బాలురు12) విద్యనభ్యసిస్తున్నారు. ఆరు సబ్జెక్టులకు ఆరుగురు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుడు ఉండాలి. అలాగే పీఈటీ, ఆర్ట్ ఉపాధ్యాయులూ ఉండాలి. వీరెవరూ లేని కారణంగా పిల్లల చదువు దెబ్బతింటోందని గ్రామస్తులు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి ఉపాధ్యాయులను నియమించాలని కోరుతన్నారు.

స్కావెంజర్ల కొరత.. వేధిస్తున్న అపరిశుభ్రత



తరగతి గదిలో విద్యార్థులతో ఉపాధ్యాయుడు

చేవెళ్ల: మండల పరిధి ఆలూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు తరగతులు కొనసాగుతున్నాయి. జిల్లా పరిషత్ బాలికల, ప్రాథమిక పాఠశాలలు ఇక్కడే ఉన్నాయి. ఒకే ప్రాంగణంలో మూడు బడులు కొనసాగుతున్నప్పటికీ.. విద్యార్థుల సంఖ్య నామమాత్రంగానే ఉంది. సరిపడా ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ.. ఏ క్లాస్‌లోనూ పూర్తిస్థాయిలో విద్యార్థులు లేరు. మొత్తం ఇక్కడ 110 మంది విద్యార్థులకు గాను 96 మంది హాజరయ్యారు. 6వ తరగతికి ప్రవేశాలు జరుగుతున్నందున కొత్తగా వచ్చేవారికి కావాల్సిన పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందించాల్సి ఉంది. మధ్యాహ్న భోజనం వండే వారు లేక.. అక్షయపాత్ర సంస్థ ద్వారా విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. బాలబాలికలకు వేరువేరుగా మరుగుదొడ్లు కావాల్సి ఉంది. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో బాలికల టాయిలెట్ల నిర్మాణం చేపట్టారు. కానీ స్కావెంజర్లు లేక అపరిశుభ్రత వాతావరణ నెలకొంది. అంటెండర్లు, కిందిస్థాయి సిబ్బంది లేకపోవటంవతో తరగతి గదులను జీపీ సిబ్బందితో శుభ్రం చేయిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

తగ్గుతున్న ఉత్తీర్ణత శాతం

దుద్యాల్: గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు ధీటుగా బోధన ఉండేది. ఉత్తీర్ణత శాతం ఎక్కువగానే ఉండేది. కానీ ప్రస్తుతం ఏటా తగ్గిపోతోంది. మండల పరిధి దుద్యాల్, హకీంపేట్, హస్నాబాద్, కుదురుమల్ల గ్రామాల్లో జెడ్పీ పాఠశాలలు ఉన్నాయి. ప్రతి స్కూల్‌లో ఏదో ఒక సబ్జెక్టుకు ఉపాధ్యాయులు లేకపోవడంతో 10వ తరగతి విద్యార్థులకు ఇబ్బందిగా మారిందని ప్రాధానోపాధ్యాయులు తెలిపారు. కుదురుమల్ల బడిలో జీవశాస్త్రం టీచర్ లేరు. హస్నాబాద్ పాఠశాలలో జీవశాస్త్రం, ఇద్దరు గణితం ఉపాధ్యాయులకు ఒక్కరే ఉన్నారు. హకీంపేట్‌లో ముగ్గురు గణితం ఉపాధ్యాయులకు ఒక్కరు, దుద్యాల్‌లో సాంఘిక, జీవశాస్త్రం బోధకులు లేరు. దీంతో 10వ తరగతి విద్యార్థులకు నష్టం జరుగుతుందని హెచ్‌ఎంలు పేర్కొంటున్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో టెస్ట్ ఉత్తీర్ణత శాతం దుద్యాల్ 60 మంది పరీక్ష రాయగా.. 38 మంది, హస్నాబాద్ 71 మందికి 30 మంది, హకీంపేట్‌లో 59 మందికి 49 మంది, కుదురుమల్లలో 36 మందికి 20 మంది పాసయ్యారు. టీచర్ల కొరత వలనే ఉత్తీర్ణత తగ్గుతోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, హస్నాబాద్

ఎంపికైనా.. నిధులు మంజూరు కాలే!

శంకర్‌పల్లి: పట్టణంలోని ఉర్దు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద ఎంపికైనా నిధులు మంజూరు కాలేదు. ఆ పాఠశాలలో తాగునీరు, ఇతర అవసరాలకు నీటి సరఫరా లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఉర్దు మాధ్యమంలో 60మంది చదువుతున్నారు. గతేడాది ఈ పాఠశాలలో ఒక ప్రధానోపాధ్యాయురాలు, మరో ఉపాధ్యాయురాలు ఉండగా.. ఈ నెల 13న ప్రధానోపాధ్యాయురాలు సెలవులు పెట్టి విదేశాలకు వెళ్లారు. దీంతో ప్రస్తుతం ఒకే ఉపాధ్యాయురాలు ఉంది. పాఠశాల ప్రారంభమైన 10రోజుల తర్వాత ఉర్దు కాకుండా.. ఇంగ్లిష్ సబ్జెక్ట్ టీచర్‌ను డిప్యుటేషన్‌పై తీసుకు వచ్చారు. మరో ఉర్దు టీచర్‌ను నియమించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇప్పటి వరకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారని, నోట్‌బుక్స్ ఇవ్వలేదని పేర్కొన్నారు.

ముక్కుమూసుకుని..

మొయినాబాద్ రూరల్: మండల పరిధి ఎన్కెపల్లి ప్రాథమిక పాఠశాలలో నీటి సరఫరా లేక మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయి. ముక్కు మూసుకుని వెళ్తున్నామని విద్యార్థులు, ఉపాధ్యాయులు తెలిపారు. ఈ బడిలో 105 మంది 1–5వ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి ఐదుగురు ఉపాధ్యాయులు అవసరం కాగా.. ముగ్గురే పనిచేస్తున్నారు. తాగునీటికి, అత్యవసరాల వినియోగానికి నీటి సరఫరా లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధిలో భాగంగా పాఠశాల అభివృద్ధికి రూ.5.50 లక్షలు మంజూరయ్యాయి. పనులు మొదలు పెట్టాల్సి ఉంది.

బదిలీలపైనే ఆధారం

కుల్కచర్ల: కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలో 2023–24 విద్యాసంవత్సరంలో ఉత్తీర్ణత శాతం తగ్గింది. దీనికి ప్రధాన కారణం ఉపాధ్యాయుల కొరతే. కుల్కచర్లలో ఎస్జీటీ 10, స్కూల్ అసిస్టెంట్ 18, ప్రధానోపాధ్యాయులు 5, లాంగ్వేజ్ పండిట్ 8పోస్టులు ఖాళీగా ఉండగా.. చౌడాపూర్‌లో ఎస్జీటీ 12, స్కూల్ అసిస్టెంట్ 11, ప్రధానోపాధ్యాయులు 5, భాషా పండితులు 2పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో ప్రధాన సబ్జెక్టులే అధికంగా ఉండటంతో ఉత్తీర్ణత శాతం తగ్గింది. ప్రస్తుతం జరుగుతున్న బదిలీలలో ఉన్న ఖాళీలన్నీ భర్తీ అయితే, ఈ విద్యాసంవత్సరంలో ఉత్తీర్ణత శాతం పెరిగే అవకాశం ఉంది.

బడుల్లో మౌలిక వసతులు కల్పించాలి

- కలెక్టర్ ప్రతీక్ జైన్
- ప్రతి శుక్రవారం పాఠశాలలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

అనంతగిరి: పాఠశాలల్లో విద్యార్థులకు కావలసిన మౌలిక వసతులను కల్పించాలని అధికారులను కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. సోమవారం అమ్మ ఆదర్శ పాఠశాలలపై మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు, ఇంజనీరింగ్ అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాలలో చేపట్టిన పనులన్నీ నాణ్యతతో ఉండాలన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు అనుగుణంగా ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక టాయిలెట్ చొప్పున ఏర్పాట్లు చేపట్టాలన్నారు. పాఠశాలల వివరాలను బ్లాక్, తరగతి వారీగా నంబర్లతో ఫొటోలను సమర్పించాలన్నారు. తాగునీరు, లైట్స్, ఫ్యాన్లు కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు కురిసే క్రమంలో పాఠశాల భవనాల పైన నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. పాఠశాలల్లో చేపట్టిన పనులను పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతి శుక్రవారం పాఠశాలపై సమీక్ష నిర్వహిస్తానని, అధికారులు పాఠశాలల పూర్తి సమాచారంతో సంసిద్ధంగా ఉండాలన్నారు. ఈ విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో పరీక్షలు రాయనున్నట్లు దీనికి అనుగుణంగా ఉపాధ్యాయులు శ్రద్ధ వహించి ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, ప్రత్యేక అధికారులు ఈఈ లాల్‌సింగ్, ఉమేష్, మండల ప్రత్యేక అధికారులు రాంరెడ్డి, దీపారెడ్డి, మల్లేశం, బాబు మోజెస్, జ్ఞానేశ్వర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అడవుల్లో ట్రైనీ ఎఫ్‌ఆర్‌ఓలు



అడవిలో డీఎఫ్‌ఓతో శిక్షణ పొందుతున్న ఎఫ్‌ఆర్‌ఓలు

మొక్కల పెంపకం, ప్లాంటేషన్‌పై అవగాహన కల్పించిన డీఎఫ్‌ఓ

వికారాబాద్/ధారూరు: పశ్చిమ భారతదేశ సందర్శనలో భాగంగా 35 మంది ట్రైనీ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్స్ సోమవారం జిల్లాలో పర్యటించారు. వీరికి ఇండియన్ ఫారెస్టు సర్వీస్ డైరెక్టర్ ఆశ, డిప్యూటీ డైరెక్టర్ రాంమోహన్ ఆధ్వర్యంలో ధారూరు, వికారాబాద్ అడవులను సందర్శించారు. వీరంతా మహారాష్ట్రలోని షోలాపూర్ పట్టణానికి వెళుతూ మార్గమధ్యలో ఉన్న వికారాబాద్ అడవులను పరిశీలించారు. తెలంగాణ ఫారెస్టు అకాడమీలో వీరంతా శిక్షణ పొందుతున్నారు. అడవుల్లో జరుగుతున్న వివిధ రకాల పనులను తెలుసుకున్నారు. ప్లాంటేషన్ విధానం, నర్సరీ అభివృద్ధి, మొక్కల పెంపకం, అనంతగిరి అడవుల్లో టూరిజం డెవలప్‌మెంట్ మొదలైన అంశాలపై ఫీల్డ్ విజిట్ రూపంలో అధ్యయనం చేసినట్లు జిల్లా ఫారెస్టు అధికారి జ్ఞానేశ్వర్ తెలిపారు. అడవుల్లో జరుగుతున్న పనులపై రేంజ్ ఆఫీసర్ డీఎఫ్‌ఓ జ్ఞానేశ్వర్, ఎఫ్‌ఆర్‌ఓ శ్యామ్‌కుమార్, ఎఫ్‌ఎస్‌ఓ అరుణలు శిక్షణలో ఉన్న అధికారులకు అవగాహన కల్పించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

యాలాల: ఎలాంటి అనుమతులు లేకుండా కాగ్నా నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఐదు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. మండల పరిధిలోని కోకట్, బెన్నూరు హద్దులోని కాగ్నా నది నుంచి ఇసుకను అనుమతుల పేరిట తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా అనుమతులు లేని ఐదు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని యాలాల పీఎస్‌కు తరలించారు. ఐదు ట్రాక్టర్లకు సంబంధించిన డ్రైవర్లను యాలాల తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వీర్‌శెట్టిపల్లి గ్రామంలో..

తాండూరు రూరల్: మండల పరిధిలోని వీర్‌శెట్టిపల్లి గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా చెన్‌గేస్‌పూర్ రైల్వే పట్టాల సమీపం నుంచి తాండూరుకు తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారంతో పోలీసులు సోమవారం తెల్లవారు జామున దాడి చేసి ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. గ్రామానికి చెందిన నర్సిములు, నరేశ్‌లపై నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.